మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి ఆదాయం



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్ఎం విజయభాను

భూపాలపల్లి, న్యూస్‌టుడే : వరంగల్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని తొమ్మిది డిపోల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆదాయం పెరిగిందని ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం విజయభాను తెలిపారు. సోమవారం భూపాలపల్లి ఆర్టీసీ డిపోను ఆర్ఎం సందర్శించారు. సంబంధిత డిపో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్ఎం మాట్లాడుతూ.. గతేడాది డిసెంబరు 15 నుంచి సెప్టెంబరు 29వ తేదీ వరకు రీజియన్ పరిధిలో 7.38 కోట్ల మహిళా ప్రయాణికులు ప్రయాణించగా రూ.328 కోట్ల వరకు ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. భూపాలపల్లి డిపో పరిధిలో 66.48 లక్షల వరకు మహిళా ప్రయాణికులు ప్రయాణించగా, డిపోకు రూ.34.49 కోట్ల ఆదాయం వచ్చిందని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు 82 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించారు. బస్సుల కోసం వరంగల్-2 డిపోలోనే ఛార్జింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. డ్రైవర్ల కొరత కొంత మేరకు తొమ్మిది డిపోలలో ఉందని, త్వరలోనే ప్రభుత్వం డ్రైవర్లు, కండక్టర్లతో పాటు ఇతర ఉద్యోగులను భర్తీ చేస్తుందన్నారు. భూపాలపల్లి డిపోలో కార్మికులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య, సిబ్బందికి సంబంధించిన వాహనాల పార్కింగ్ షెడ్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ ఆర్ఎం(ఆపరేషన్) భాను కిరణ్, ఇన్‌ఛార్జి డీఎం రవిచంద్ర, అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి పాల్గొన్నారు.

కష్టేఫలి..!

డీఎస్సీలో మెరిశారు.. అనుకున్నది సాధించారు!

'డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం నుంచి ఉంటుంది. సరైన ధ్రువపత్రాలతో హాజరుకావాలి. పూర్తి వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలి'

న్యూస్‌టుడే యంత్రాంగం

కల నెరవేరింది.. కష్టానికి ఫలితం దక్కింది. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎన్నో ఏళ్లుగా వీరు ఎదురుచూశారు. ఇతర అవకాశాలు ఉన్నా కాదనుకున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడంతో దీక్షగా చదివి చివరికి అనుకున్నది సాధించారు. ప్రభుత్వం సోమవారం వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో సబ్జెక్టులవారీగా జిల్లాల్లో మొదటి, రెండో ర్యాంకులు సాధించినవారి స్ఫూర్తిదాయక కథనం..



మల్లేవేన సంజీవ్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచెర్లకు చెందిన మల్లేవేన లక్ష్మయ్య, కనకలక్ష్మి దంపతుల కుమారుడు మల్లేవేన సంజీవ్ స్కూల్ అసిస్టెంట్(తెలుగు)లో రెండో ర్యాంకు సాధించారు. పరకాలలో ఓ ప్రైవేటు కళాశాలలో బీఈడీ పూర్తిచేసి ఎంఏ తెలుగులో పట్టా పొందారు. ఇంటి వద్దనే ఉంటూ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదివారు. – మల్హర్

దంపతులు సాధించారు



నాగలక్ష్మి, వినయ్ దంపతులు

వరంగల్ జిల్లా నల్లబెల్లికి చెందిన కొండ్లె నాగలక్ష్మి, వినయ్ దంపతులు డీఎస్సీలో ప్రతిభ చాటారు. వినయ్ జిల్లా స్థాయిలో ఏడో ర్యాంకు, నాగలక్ష్మి 54వ ర్యాంకు సాధించారు.



ప్రవళిక

● నల్లబెల్లికి చెందిన మూటికె ప్రవళిక 83.20 మార్కులతో జిల్లాస్థాయిలో రెండో ర్యాంకు సాధించి సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుకు ఎంపికయ్యారు. రాజిత, రాజులు ఆమె తల్లిదండ్రులు. వారిది వ్యవసాయ కుటుంబం. – నల్లబెల్లి

ఒకేసారి మూడు ఉద్యోగాలు..



మామిడి మహేశ్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గిద్దెముత్తారం గ్రామానికి చెందిన మామిడి మహేశ్ మూడు ఉద్యోగాలు సాధించి మురిపించారు. తెలుగు పండిట్ విభాగంలో 80.90 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 76.40 మార్కులతో జిల్లా మూడో ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో 73.40 మార్కులతో జిల్లా ఐదో ర్యాంకు సాధించారు. మహేశ్ ప్రస్తుతం ప్రభుత్వ గురుకుల టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తండ్రి సమ్మయ్య, కుటుంబ సభ్యులు, గురువుల ప్రోత్సాహంతో మంచి ఫలితం సాధించేందుకు కారణమైందని ఆయన చెప్పారు. –చిట్యాల



ఎండీ ఫర్జానా

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఎండీ ఫర్జానా స్కూల్ అసిస్టెంట్ హిందీ విభాగంలో 65.67 మార్కులు సాధించారు. సిద్ధిపేట జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. రెండు నెలల క్రితం హిందీ విభాగంలో జేఎల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. – దుగ్గొండి

ఉద్యోగం వదులుకొని సన్నద్ధం



శ్వేత

వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రాగంపేట గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగిన ఎలగందుల శ్వేత మొదటి ర్యాంక్ సాధించారు. ప్రస్తుతం హనుమకొండ వికాస్‌నగర్‌లో ఉంటున్న ఆమె బీఎస్సీ, డీఈడీ చదివారు. ఎస్జీటీ విభాగంలో 100 మార్కులకు గాను 83.37 మార్కులు సాధించారు. గతంలో నల్లబెల్లి మండలంలో పంచాయితీ కార్యదర్శి ఉద్యోగం సాధించిన ఆమె.. ఆ ఉద్యోగం వదులుకొని ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న ఆసక్తితో డీఎస్సీ రాశారు. భర్త శ్రీకాంత్ ఎస్సైగా పనిచేస్తున్నారు. – రంగశాయిపేట

కష్టాలు ఎదుర్కొని..



గడ్డం ఫణీంద్ర

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఒడిపిలవంచ గ్రామానికి చెందిన గడ్డం ఫణిందర్ జిల్లా 3వ ర్యాంకు సాధించాడు. తండ్రి వైకుంఠం ఏడాది కిందట మృతి చెందగా తల్లి పద్మ గ్రామంలో రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నియామకాల్లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగం సాధించాడు. డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో ఉద్యోగానికి సెలవుపెట్టి పట్టుదలతో చదివి ఉన్నత ర్యాంకు సాధించాడు. గ్రూప్-4లోనూ జిల్లాలో 13వ ర్యాంకు తెచ్చుకున్నారు. – కాటారం

ఐదో ప్రయత్నంలో



రాజేందర్

భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం మడ్తపల్లి గ్రామానికి చెందిన జంగిలి రాజేందర్ గణిత విభాగంలో 75.30 మార్కులతో రెండో ర్యాంకు సాధించారు. 2008 ఏడాదిలో డీఎస్సీ, 2012, 2017, 2023లో గురుకుల పోస్టుల కోసం పరీక్షలు రాయగా అతి తక్కువ మార్కుల తేడాతో ఉద్యోగాలను కోల్పోయారు. నిరాశ చెందకుండా ప్రణాళిక ప్రకారం చదువుతూ ఐదో ప్రయత్నంలో ఉద్యోగం సాధించడంపై ఆనందం వ్యక్తం చేశారు. – రేగొండ

పీడీ, పీఈటీ ఉద్యోగాలకు



నేతుల రాజు

వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయికి చెందిన నేతుల రాజు డీఎస్సీలో ప్రథమ ర్యాంకు సాధించి ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. – సంగెం

నిరుపేద కుటుంబం..



మేడి నాగరాజు

నెక్కొండ: నెక్కొండకు చెందిన మేడి నాగరాజు డీఎస్సీ (తెలుగు లాంగ్వేజ్ పండిట్)లో మహబూబాబాద్ జిల్లాలో 70.17 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. నిరుపేద కుటుంబానికి చెందిన నాగరాజు పదో తరగతి వరకు ఇనుగుర్తిలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు.

ఎస్జీటీలో ప్రథమ ర్యాంకు



జన్నె రాగసుధ

భూపాలపల్లి జిల్లా టేకుమట్లకు చెందిన జన్నె రాగసుధ ఎస్‌జీటీ విభాగంలోమొదటి స్థానంలో నిలిచారు. స్వగ్రామం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట. టేకుమట్ల మండలం అంకుషాపూర్‌లోని అమ్మమ్మ ఇంటి వద్ద చదువుకున్నారు. – టేకుమట్ల

విద్యుత్తు శాఖలో బదిలీలకు రంగం సిద్ధం

న్యూస్‌టుడే, భూపాలపల్లి



విద్యుత్తు ఉప కేంద్రం

ఇప్పటికే దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల్లో సాధారణ బదిలీల ప్రక్రియ పూర్తి కాగా విద్యుత్తు శాఖలో ప్రస్తుతం బదిలీలకు రంగం సిద్ధమైంది.. ఈ ప్రక్రియలో ఒకేచోట రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి బదిలీకి అవకాశం కల్పించారు. క్యాడర్ మొత్తంలో 50 శాతం మాత్రమే బదిలీ చేసుకునే అవకాశం ఇచ్చారు. ఆఫీసు సబార్డినేట్ నుంచి డీఈ స్థాయి వరకు అన్ని క్యాడర్లలో బదిలీలు జరగనున్నాయి. కొన్ని క్యాడర్లు కార్పొరేట్ శాఖ పరిధిలోకి వస్తాయి. మిగతావి జిల్లాలోని ఎస్ఈ, డీఈల పర్యవేక్షణలో బదిలీలు చేపట్టనున్నారు. ఇప్పటికే బదిలీకి అవకాశం ఉన్న ఉద్యోగుల జాబితాలను జిల్లా సర్కిల్ కార్యాలయం నోటీసు బోర్డుపై, సంబంధిత పోర్టల్‌లో పొందుపర్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఏమైనా అభ్యంతరాలుంటే అక్టోబరు 4వ తేదీలోగా దరఖాస్తు చేయాలని సూచించారు. ఐడీ, ఏఈ, సబ్ ఇంజినీర్ తదితర స్థాయిల వారు అంతర్జాలంలో, ఇతరులు, మాన్యువల్‌గా పోస్టుల ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించారు. అక్టోబరు 7వ తేదీన బదిలీ అయ్యే ఉద్యోగుల జాబితా విడుదల చేస్తారు. ఈ మేరకు బదిలీల జాబితాలో పేరు ఉన్నవారు ఈ నెల 9వ తేదీ లోపు రిలీవ్ అయి మరుసటి రోజు కొత్త స్థానాల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

11 క్యాడర్లలో : జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల ప్రక్రియ మొదలుకావడంతో సందడి నెలకొంది. మొత్తం 11 క్యాడర్లలో 103 మంది ఉద్యోగులు బదిలీ కానున్నట్లు తెలిసింది. జిల్లా పరిధిలో బదిలీల ప్రక్రియ డివిజన్ స్థాయిలో ఒక సెక్షన్ నుంచి మరో సెక్షన్‌కు చేపట్టనున్నారు. జేఎల్ఎం, లైన్ ఇన్‌స్పెక్టర్, ఏఎల్ఎం, లైన్‌మెన్, అటెండర్ స్థాయి ఉద్యోగుల బదిలీల ప్రక్రియ డివిజన్‌లోని డీఈల ఆధ్వర్యంలో పూర్తి చేస్తారు. సర్కిల్ పరిధిలో ఎస్ఎఐ, ఫోర్‌మెన్, సీనియర్ అసిస్టెంట్, జూనియన్ అసిస్టెంట్, జేఏవో, సబ్ ఇంజినీర్ తదితర ఉద్యోగులకు బదిలీలుంటాయి. సర్కిల్ పరిధిలో జరిగే ప్రక్రియను ఎస్ఈ పర్యవేక్షిస్తారు. జిల్లా క్యాడర్ ఉద్యోగులకు భూపాలపల్లి, ములుగు డివిజన్లతో పాటు ఎంఆర్‌టీ డివిజన్, సర్కిల్ ఆఫీసు పరిధిలో ఖాళీలు ఉంచుకోవచ్చు. ఆ పైస్థాయి ఉద్యోగులు ఇతర జిల్లాలనూ ఎంచుకోవచ్చు.

క్యాడర్లవారీగా బదిలీలు పొందేవారు..	
డీఈ	1
ఏడీఈ	6
ఏఈ	7
సబ్ ఇంజినీర్‌లు	18
సీనియర్ అసిస్టెంట్	13
జూనియర్ అసిస్టెంట్	12
సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్	6
జేఏవోలు	8
ఫోర్‌మెన్‌లు	3
లైన్‌మెన్‌లు	22
ఆఫీసు సబార్డినేట్	7

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



శిక్షణ పొందిన మహిళకు ధ్రువపత్రం అందిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ తదితర యూనిట్ల ఏర్పాటుతో మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణలో శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు మహిళలకు సోమవారం కలెక్టర్ ధ్రువపత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ క్యాంటీన్ల నిర్వహణలో శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. మహిళలు హోటల్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ శిక్షణ పూర్తి చేసుకోవడం ద్వారా వ్యాపారం విజయవంతంగా నిర్వహించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇన్‌ఛార్జి డీఆర్డీవో అవినాశ్, ఏపీడీ గోవిందరావు పాల్గొన్నారు.

● కుక్కల వృద్ధి నియంత్రణకు శస్త్ర చికిత్స కేంద్రం ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కుక్కల వృద్ధి నియంత్రణ కేంద్రం ఏర్పాటుపై మున్సిపల్, పశు సంవర్ధక శాఖ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కుమారస్వామి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

● బతుకమ్మ పండగ సంబరాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 2 నుంచి ప్రారంభంకానున్న బతుకమ్మ సంబరాలు, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా అక్టోబర్ 2న ప్రత్యేక గ్రామసభల నిర్వహణ తదితర అంశాలపై సోమవారం అన్ని మండలాల ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. బతుకమ్మ నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్తు, పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి పురస్కరించుకుని ప్రత్యేక గ్రామసభలు ఏర్పాటు చేయడంతో పాటు పారిశుద్ధ్య కార్మికులను సన్మానించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు, డీఆర్డీవో అవినాశ్ పాల్గొన్నారు.




ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ షురూ

భూపాలపల్లి, న్యూస్‌టుడే : వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఓటరు నమోదు ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు భూపాలపల్లి నియోజకవర్గం(108) పరిధిలోని సంబంధిత మండలాల ఉపాధ్యాయులు ఓటు నమోదు కోసం నవంబరు 6వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని స్థానిక తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. ఓటరు ముసాయిదా జాబితా నవంబరు 23న విడుదల చేయడం జరుగుతుందని, అభ్యంతరాలు ఉంటే నవంబరు 23 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు తుది జాబితా డిసెంబరు 30న విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంజాయి విక్రయిస్తే రౌడీ షీట్ తెరవండి

ములుగు టౌన్, న్యూస్‌టుడే: సమస్యలతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి న్యాయం జరిగేలా దర్యాప్తు ముమ్మరం చేయాలని జిల్లా పోలీస్ అధికారి శబరీష్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సోమవారం నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో కూడా సీసీ టీవీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎటువంటి నేరం జరిగినా.. క్షణాల్లో నేరస్థులను పట్టుకోవచ్చని వివరించారు. గంజాయి విక్రయం, తరలింపుపై నిఘా పెంచాలని, అమ్మినవారిపై రౌడీ షీట్ తెరవాలని పేర్కొన్నారు. ఠాణాలకొచ్చే వారిపై మర్యాదగా వ్యవహరించాలని, స్టేషన్‌కొస్తే సమస్య పరిష్కారమవుతుందనే భరోసా పోలీసు అధికారులు కల్పించాలని సూచించారు.

కనికరించండి.. కష్టాలు తీర్చండి!



ప్రజావాణిలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

న్యూస్‌టుడే, భూపాలపల్లి కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి పాలనాధికారికి వినతులు అందించారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని వేడుకున్నారు. మొత్తం 57 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ రాహుల్ శర్మ అఅధికారులను ఆదేశించారు. అన్ని శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలను నేరుగా తెలిపేందుకు ప్రజావాణి ఒక చక్కని వేదికలా ఉపయోగపడుతుందని.. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. వచ్చే ప్రజావాణి వరకు సంబంధిత శాఖల అధికారులు పరిష్కార నివేదికలతో హాజరుకావాలని ఆదేశించారు.

ఏళ్లుగా తిరిగినా పరిహారం రాలే..

- సింగరేణి ఓసీ-I, 2 భూ నిర్వాసితులు



సింగరేణి ఓసీ-1, 2 విస్తరణ, అభివృద్ధికి భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు, సెగ్గంపల్లి, వేశాలపల్లి, కాశీంపల్లి గ్రామాలకు చెందిన సాగు భూములను అందించాం. కొన్ని భూములకు పరిహారం అందించి అధికారులు చేతులు దులుపుకొన్నారు. ఇంకా 150 ఎకరాలకు పైగా నష్టపరిహారం అందించాల్సి ఉన్నా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

షెట్టర్ ఇవ్వడం లేదు..

- జట్ల లక్ష్మయ్య, మల్లారం, మల్హర్ రావు మండలం



నేను 20 ఏళ్లుగా మల్లారం సెంటర్‌లో హోటల్ నిర్వహిస్తున్నాను. పంచాయతీ ఆధ్వర్యంలో దుకాణ సముదాయం నిర్మించారు. గతంలో వ్యాపారం చేసుకుంటున్న వారు రూ.50 వేలు చెల్లించాలని, మిగతా వారికి టెండర్ ద్వారా షెట్టర్ కేటాయిస్తామన్నారు. నేను రూ.50 వేలు చెల్లించాను. కానీ, మాజీ సర్పంచి నాకు కేటాయించకుండా తన బంధువులకు ఇచ్చారు. నిరుపేద కుటుంబానికి చెందిన నాకు కలెక్టర్ న్యాయం చేయాలి.

వేతనాలు చెల్లించట్లే..

- విద్యా వాలంటీర్లు

2023-24 విద్యా సంవత్సరానికి సబంధించి భూపాలపల్లి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వాలంటీర్‌గా విధులు నిర్వహించాం. గత 8 నెలల వేతనం చెల్లించాల్సి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఉద్యోగాలు లేక, పనిచేసిన కాలానికి వేతనాలు అందక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పెండింగ్ వేతనాలు ఇప్పించడంతో పాటు మళ్లీ విద్యా వాలంటీర్లుగా కొనసాగేలా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలి.



సదరం స్లాట్ సమస్య..

- పబ్బతి గోపాల్‌రెడ్డి, కర్కపల్లి గణపురం మండలం



నాకు ఏడాది కిందట రోడ్డు ప్రమాదంలో కాళ్లు విరిగిపోయి నడవలేని స్థితికి వచ్చాను. ప్రభుత్వం అందించే దివ్యాంగుల పింఛను కోసం సదరం ధ్రువపత్రం అవసరం ఉంది. స్లాట్ బుక్ చేసుకునేలోపు అయిపోతున్నాయి. దీంతో సదరం ధ్రువపత్రం రాక పింఛను మంజూరు కావడం లేదు. అధికారులు దయచూపి స్లాట్ బుక్ చేయించడంతో పాటు దివ్యాంగుల పింఛను మంజూరు చేయాలి.

రహదారి తంటాలు తీరనున్నాయ్!



మైసమ్మ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి సిద్ధంగా కంకరతో చదును చేసి..

భూపాలపల్లి, న్యూస్‌టుడే : భూపాలపల్లి పురపాలక సంఘం పరిధిలోని మైసమ్మ కాలనీలో 20 రోజుల క్రితం సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి నిర్మాణ పనులు ప్రారంభించడంతో కాలనీవాసుల ఇబ్బందులు తీరనున్నాయి. మోకాలు లోతు గుంతలు పూడ్చి, కంకరతో చదును చేశారు. రోలర్‌తో తొక్కించారు. రెండేళ్లుగా బురద నీటితో గుంతలమయంగా మారిన రోడ్డుపై కాలనీవాసులు ప్రయాణించాలంటే నిత్యం నరకయాతన అనుభవించారు. ఎట్టకేలకు పనులు ప్రారంభం కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారికి అతి సమీపంలో 150 కుటుంబాలు.. మరో 300 పైగా ఖాళీ నివాస స్థలాలు.. సరికొత్త ఇళ్లు.. అంతా బాగున్నా కాలనీకి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. విషయాన్ని మున్సిపాలిటీ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేలా ఆగస్టు 14న 'ఈనాడు'లో 'మైసమ్మా.. నీవే దిక్కమ్మా..' శీర్షికన కథనం వెలువడిన విషయం తెలిసిందే.. ఆగస్టు మొదటి వారంలో పట్టణంలో 'అధ్వానంగా మారిన అంతర్గత రోడ్లు' శీర్షికన ఫొటో వార్త ప్రచురితమైంది. రూ.కోట్ల నిధులతో ప్రగతి పనులు చేపట్టినా వర్షాకాలంలో తలెత్తే సమస్యలతో లోపాలు వెలుగులోకి తీసుకురావడంతో పాటు 20 రోజుల క్రితం క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ ఇంజినీరింగ్ అధికారులతో పాటు గుత్తేదారులతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పనులు వెంటనే పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. ఈ క్రమంలోనే పురపాలక సంఘం పరిధిలోని 10వ వార్డు ప్రాంతంలోని మైసమ్మ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన గ్రౌండ్, బేస్ లెవల్ పనులు పూర్తి చేశారు. రోడ్డుపై ఆరు ఇంచుల మందం కంకర పోసి, రోలర్‌తో తొక్కించారు. గుంతలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మొరం పోసిన తర్వాత కంకర నేర్పుతూ.. బ్లేడ్ ట్రాక్టర్‌తో లెవల్ పనులు చేపట్టినట్లు స్థానిక మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. మరో కొద్ది రోజుల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు అధికారికంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు.



రైతు బంధు, కౌలు డబ్బులు వచ్చేలా చేశారు

ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన ఈయన పేరు మామిడిశెట్టి చిన్న మల్లయ్య. ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరికి పెళ్లిళ్లు చేసి ఇళ్ల స్థలాలు, భూములు పంచి ఎకరం భూమిని తమ పోషణ నిమిత్తం ఉంచుకున్నారు. ఆ భూమి పొరపాటున పెద్ద కొడుకు రాజు పేరున పాసుబుక్‌లో నమోదైంది. దీంతో రైతుబంధు పెద్దకుమారుడికే వెళుతుంది. తండ్రి తన పోషణ నిమిత్తం ఉంచుకున్న భూమిని చిన్న కుమారుడు కౌలుకు చేస్తూ కౌలు డబ్బులు తండ్రికి ఇవ్వడం లేదు. దీంతో మామిడిశెట్టి చిన మల్లయ్య ములుగు ఆర్డీవో సత్యపాల్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారి చట్ట ప్రకారం నోటీసులు జారీ చేశారు. తహసీల్దారు విచారణ జరిపి ఆర్డీవోకు నివేదిక సమర్పించారు. ఇరు వర్గాల వాదనలు విన్న ఆర్డీవో మల్లయ్య భూమి ఆయన పేరిట నమోదు చేయాలని సెప్టెంబరు 9న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రైతు బంధు, కౌలు డబ్బులు ఆర్జీదారుకు చెందేలా మార్గం సుగమమైంది.

ప్రతి నెలా రూ.2 వేలు చెల్లించాలి



వెంకటాపురం మండలం నల్లగుంట గ్రామానికి చెందిన గోపిశాల సమ్మక్కకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద కొడుకు ఉద్యోగరీత్యా హనుమకొండలో ఉంటున్నారు. ఊళ్లో ఆయనకు పంచి ఇచ్చిన ఇంట్లో సమ్మక్క నివాసం ఉంటోంది. చిన్న కొడుకు మరణించిన తర్వాత కోడలు ఆ ఇంట్లో సమ్మక్కను ఉండనివ్వడం లేదు. పెద్ద కుమారుని వాటా కూడా తమకే చెందుతుందని గొడవ పడింది. దీంతో వేరే ఇంట్లో నివాసం ఉంటున్నానని ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇరువురికి నోటీసులు జారీ చేశారు. వాదనలు విన్న అనంతరం పెద్ద కుమారుడికి వాటాగా ఉన్న ఇంటిలో సమ్మక్క నివాసం ఉండేలా, ఆమె జీవనానికి పెద్ద కుమారుడు రవిందర్, చిన్న కోడలు శ్రీలత నెలకు రూ.2 వేలు ఇవ్వాలని ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి ఆదేశిస్తూ సెప్టెంబరు 19న ఉత్తర్వులు జారీ చేశారు.


పిల్లలను పెంచి.. పెద్దచేసిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో నిరాదరణకు గురవుతున్నారు.. దీంతో మలిదశ వయసులో క్షోభ అనుభవిస్తున్నారు.. బతుకుమార్గం చూపిన అమ్మానాన్నలను కంటికిరెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.. చట్టపరంగా వృద్ధులకు హక్కులు ఉన్నాయి.. నిరాదరణకు గురవుతున్న సందర్భాల్లో న్యాయస్థానాలు అండగా ఉంటున్నాయి.. మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

వయోవృద్ధులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా టోల్‌ఫ్రీ 14567 నంబరును సంప్రదించాలి.



టోల్‌ఫ్రీ నంబరుపై వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు (పాత చిత్రం)

పోషణ చట్టం.. వృద్ధులకు పట్టం



న్యూస్‌టుడే- హనుమకొండ కలెక్టరేట్, గిర్మాజీపేట, ములుగు

అండగా చట్టాలు..

తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణాధారం, సంరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయి.. హిందూ దత్తత, పోషణ చట్టం-1956 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రేమతో కేసులు వేయడం లేదు. దీంతో వేగవంతమైన సహాయాన్ని అందించేందుకు న్యాయ స్థానాలతో సంబంధం లేకుండా తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం- 2007ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. తెలంగాణ ప్రభుత్వం సవరణ నియమావళి-2022ను రూపొందించింది.

దరఖాస్తు ఎవరికి సమర్పించాలి..?

వృద్ధులు, తల్లిదండ్రులు ఎక్కడ నివసిస్తున్నారో, ఇంతకుముందు చివరిసారిగా ఎక్కడ నివసించారో తెలుపుతూ వారి పిల్లలు లేదా బంధువులు ఎక్కడ నివసిస్తారో.. తెలుపుతూ ఆయా జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారి(మెయింటెనెన్స్ ట్రిబ్యునల్), జిల్లా సంక్షేమాధికారికి పోషణ ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకోవాలి.

90 రోజుల్లో విచారణ

వయోవృద్ధులు దరఖాస్తు చేసుకున్న 90 రోజుల వ్యవధిలో ట్రైబ్యునల్ పిల్లలకు నోటీసులు పంపించి విచారణాధికారులచే వాదనలు, సాక్ష్యాలు సేకరించి పోషణ ఖర్చుల చెల్లింపునకు ఆదేశిస్తుంది.. మూడు నెలల పాటు సదరు పిల్లలు పోషణ ఖర్చులు ఇవ్వకపోతే తల్లిదండ్రులు తిరిగి ట్రైబ్యునల్‌ను ఆశ్రయించొచ్చు. ఉత్తర్వులు పాటించని పిల్లలు, బంధువులకు జరిమానా, జైలు శిక్ష విధించే హక్కు దానికి ఉంటుంది. పిల్లలు, బంధువులు పోషణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తిరిగి వారి ఆస్తులను స్వాధీనం చేసుకునే హక్కు ఉంటుంది.

☛ నడవలేని వయోవృద్ధులకు వీల్‌ఛైర్స్, చేతి కర్రలు, ఇతర పరికరాలు, వినికిడి యంత్రాలు, కళ్లజోడులు అందజేస్తారు. వృద్ధులు జిల్లా సంక్షేమాధికారికి దరఖాస్తు చేసుకోవాలి. వృద్ధాప్యంలోని తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే.. పిల్లలతో ఇబ్బందులు ఎదురైతే జిల్లా సంక్షేమాధికార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా ఇన్‌ఛార్జి సంక్షేమాధికారిణి రాజమణి తెలిపారు.

ఆశ్రమాల్లో ఆదరణ..

నిరాదరణకు గురైన వృద్ధులకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనాథాశ్రమాల్లో సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 వృద్ధాశ్రమాలు ఉండగా అందులో సుమారు 474 మంది ఉంటున్నారు.

జిల్లా	ఆశ్రమాలు	వృద్ధుల సంఖ్య
హనుమకొండ	10	252
వరంగల్	05	154
జనగామ	02	30
మహబూబాబాద్	01	12
భూపాలపల్లి	01	10
ములుగు	01	16



నగరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..



-తేరాల యుగంధర్, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ కార్యదర్శి

2018లో మేం వయోవృద్ధుల సంక్షేమ సంఘాన్ని స్థాపించాం. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్నారు. చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. లయన్స్ క్లబ్ సహకారంతో కంటి వైద్య పరీక్షలు చేయిస్తున్నాం. మా పోరాటం వల్లే ఎంజీఎం ఆసుపత్రిలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఓపీ విభాగం ఏర్పాటు చేశారు.

కనీసం తిండి పెట్టకుండా..



స్టాండు సాయంతో మెట్లు దిగుతున్న ఈ వృద్ధుడి పేరు వేల్పుల నర్సయ్య వయసు 90 ఏళ్లు.. సంగెం మండలం గవిచర్ల నివాసి.. భార్య ఆగమ్మ అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమితమయ్యారు. తన నాలుగెకరాల భూమిలో 2.5 ఎకరాలను కుమారుడు అక్రమంగా పట్టా చేసుకున్నాడు. మిగిలిన భూమి చెరువు శిఖం కింద ఉంది. గతంలో ఇద్దరు కుమార్తెలకు పసుపు, కుంకుమ కింద 10 గుంటల చొప్పున రాసిచ్చాడు. ఆ భూమిపై కన్నేసిన కుమారుడు తన పేరుపై రాసివ్వాలని ఒత్తిడి తెస్తూ.. తల్లిదండ్రులైన ఇద్దరు వృద్ధులను ఓ చిన్న గదిలో ఉంచి తిండి పెట్టడంలేదు. ఇష్టమొచ్చినట్లు కొడుతున్నాడని కన్నీటి పర్యంతమయ్యారు. తన బాధను గత జులైలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

గిఫ్ట్ డీడ్ రద్దు చేసి..

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పైడిచింతలపల్లి గ్రామానికి చెందిన గడ్డం బాపురెడ్డి కుమారుడైన స్వామిరెడ్డికి 6.5 ఎకరాలను గిఫ్ట్ డీడ్ చేశారు. కాగా, వృద్ధాప్యంలో బాగోగులు చూడడం లేదని.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో కుమారుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో గిఫ్ట్ డీడ్‌ను రద్దుచేయాలని గత ఆగస్టులో దరఖాస్తు చేశారు. కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి గిఫ్ట్‌డీడ్‌ను రద్దుచేసి తిరిగి తండ్రి పేరిట భూమిని బదిలీ చేయాలని అధికారులను ఆదేశించారు. తండ్రి పోషణకు ప్రతి నెలా రూ.10 వేలు చెల్లించాలని కుమారుడిని ఆదేశించారు.

అవార్డుల స్ఫూర్తితో అభివృద్ధి



మేయర్ సుధారాణికి ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్మార్ట్‌సిటీ, నైబర్‌హుడ్ ఛాలెంజ్ పోటీల్లో గ్రేటర్ వరంగల్‌కు అవార్డులు రావడం గర్వకారణమని, ఇదే స్ఫూర్తితో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఇటీవల కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ ఇచ్చిన 'ఎక్సలెన్స్' ధ్రువపత్రాన్ని సోమవారం రాత్రి బల్దియా ప్రధాన కార్యాలయంలో అధికారులు మేయర్‌కు అందజేశారు. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈలు కృష్ణమోహన్, కృష్ణమూర్తి, రంగారావు, ఏఈలు పాల్గొన్నారు.

యువ పరిశోధకులకు ప్రోత్సాహం



ప్రభాకర్ నరేంద్రకుమార్

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మిరప పంటను ఆశిస్తున్న నల్లతామర తెగులు నివారణకు పరిశోధనలు చేసి సేంద్రియ ఆధారిత మందులు తయారుచేసిన యువ పరిశోధకులను తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ద్వారా ప్రభుత్వం అందించే రూ.5 లక్షల టీ-స్పార్క్ గ్రాంట్ వరించింది. వివిధ రంగాల్లో పరిశోధనలు చేస్తున్న వారి నుంచి 2024 ఆగస్టులో అంతర్జాలం ద్వారా ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి యువకుడు గాజుల ప్రభాకర్, డోర్నకల్ యువకుడు నరేంద్రకుమార్ ఓయూలో ఎంఎస్సీ పీహెచ్‌డీ పూర్తి చేసి శ్రీజీపీఎవెన్ లైఫ్ సైన్సెస్ అనే స్టార్టప్ సంస్థను స్థాపించి పంటలపై ఆశించే పురుగు, తెగుళ్ల నివారణకు పరిశోధనలు చేస్తున్నారు. హైదరాబాద్ ఐకేపీ నాలెడ్జ్ పార్క్ సహాయంతో త్రిప్ క్లియర్ అనే సేంద్రియ ఆధారిత పురుగు మందు రూపొందించారు. టీ-స్పార్క్ వారు పలుమార్లు పరిశీలించి గ్రాంట్‌కు తమ సంస్థను ఎంపిక చేశారని ప్రభాకర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. తమ ఉత్పత్తిని త్వరలో మార్కెట్లోకి తీసుకురానున్నట్లు వారు వివరించారు.

కాలుష్యపు కోరల్లో.. మంచినీళ్ల చెరువు



రైతు బాలయ్య కుడి చేతి సీసాలో స్వచ్ఛమైన నీరు.. ఎడమచేతిలో కలుషితమైన చెరువు నీరు

వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రం శివారులోని 'మంచినీళ్ల చెరువు' కాకతీయుల కాలం నుంచి గ్రామ ప్రజలకు తాగునీటి వరప్రదాయిని. పంట పొలాలకు సాగునీరు అందించే ప్రధాన జలవనరు. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన తటాకం నేడు కోళ్ల పరిశ్రమ వ్యర్థాలతో కాలుష్య కాసారంగా మారింది. సుమారు 115 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు 120 మత్స్యకార కుటుంబాలు ఈ చెరువుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. పదేళ్ల క్రితం వరకు చెరువులో నాణెం వేసినా స్పష్టంగా కనపడేదని స్థానికులు తెలిపారు. తొమ్మిదేళ్ల క్రితం కోళ్ల పరిశ్రమ వెలిసినప్పటి నుంచి మంచినీళ్ల చెరువు కాలుష్యపు కోరల్లో చిక్కుకుంది. పశుపక్ష్యాదులు సైతం ఈ నీటిని తాగలేని పరిస్థితి. గ్రామానికి మంచి నీటిని సరఫరా చేసే బోరు బావులు చెరువులోనే ఉండటంతో.. ఈ నీటిని తాగిన వారు జబ్బుల బారిన పడుతున్నారు. స్నానపానాదులకు ఈ నీటిని వాడినా.. చర్మవ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. కోళ్ల పరిశ్రమ నిర్వాహకులు ఓ కాలువ ద్వారా అర్ధరాత్రి వ్యర్థాలను చెరువులో వదులుతున్నారు. దీనిపై గ్రామస్థులు ఉద్యమం ప్రారంభించారు. గ్రామ పరిరక్షణ కమిటీ పేరిట అధికారులు, ప్రజాప్రతినిధులకు తమ గోడు చెబుతున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో పాలనాధికారి డా.సత్యశారదను కలిసి సమస్య విన్నవించారు.



వరంగల్ కలెక్టరేట్ ఎదుట రాయపర్తి గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే రాయపర్తి

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	110
రిటైల్:	132
డ్రెస్:	191
స్కిన్‌లెస్:	218

మేళతాళాలు.. పూల జల్లుల మధ్య ఉపాధ్యాయులకు వీడ్కోలు

నర్సింహులపేట, న్యూస్‌టుడే: బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు మేళతాళాలు మధ్య పూలు చల్లుతూ, కోలాటాలు వేస్తూ ఆనందోత్సాహాల మధ్య వీడ్కోలు, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు నర్సింహులపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు. వారం రోజుల కిందట ఇతర పాఠశాలలకు 18 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. పదకొండేళ్లపాటు తమకు చదువులు చెప్పిన గురువులకు వీడ్కోలు సమావేశంలో పూలమాలలు వేసి శాలువా, జ్ఞాపికలతో సన్మానించి కన్నీరుమున్నీరయ్యారు. ఇటీవల పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నర్సిరెడ్డి, పూర్వ ప్రిన్సిపల్ ఆనంద్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సెమీస్ చేరిన నల్గొండ, మహబూబ్‌నగర్ జట్లు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో నల్గొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల జట్లు సెమీస్‌కు చేరాయి. సోమవారం కోమటిపల్లి మైదానంలో వరంగల్, నల్గొండ జట్ల మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు 16.5 ఓవర్లలో 52 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఛేదనలో నల్గొండ జట్టు 19 ఓవర్లలో 53 పరుగులు చేసి విజయం సాధించింది. నల్గొండ బౌలర్లలో యశ్వంత్ 4 వికెట్లు, శ్రీఖర్ 3 వికెట్లు పడగొట్టి విజయంలో కీలకపాత్ర పోషించారు. మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, మెదక్ జట్ల మ్యాచ్ జరిగింది. నిర్ణీత 50 ఓవర్లలో మహబూబ్‌నగర్ జట్టు మూడు వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. అభిలాష్ 66 పరుగులు, అబ్దుల్ 54 పరుగులు చేశారు. తర్వాత బాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌట్ అయ్యింది. మంగళవారం నుంచి పూల్ 'బి'లోని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడలకు ఎంపిక

అడ్డంకిగా మారిన పేదరికం



ప్రతిభకు అవయవలోపం, పేదరికం అడ్డుకాదని నిరూపించారు పలిమెల మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి.. అయిదేళ్ల వయసున్నప్పుడే రోడ్డు ప్రమాదంలో కుడి కాలు కోల్పోయారు. ప్లాస్టిక్ కాలు సాయంతో నడుస్తున్నారు. ప్రస్తుతం హనుమకొండ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఇంటర్ చదువుతున్న సమయంలో జేఎన్ స్టేడియంలో జరిగిన పోటీలను చూసి క్రీడల్లో ఆసక్తి పెంచుకున్నారు. సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ త్రోబాల్ పోటీల్లో పాల్గొని పసిడి పతకాలు సాధించి జాతీయ స్థాయి ఆటలకు ఎంపికయ్యారు. సెప్టెంబరు 22 నుంచి 26 వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆడి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. అంతర్జాతీయ స్థాయి పారా త్రోబాల్ విభాగంలో ఎంపికయ్యారు. డిసెంబరులో కంబోడియా దేశంలో జరిగే అంతర్జాతీయ ఆటల్లో పాల్గొనేందుకు రూ.లక్ష ఖర్చవుతుందని, అక్టోబరు 15లోపు రూ.50,000 చెల్లిస్తేనే అర్హత పొందుతానని ఆమె తెలిపారు. జ్యోతి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో రూ.లక్ష సమకూర్చడం భారంగా మారింది. దాతలు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పలిమెల(భూపాలపల్లి జిల్లా)

వరికి సుడిదోమ 'పోటు'!



న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరి పంటకు సుడిదోమ సోకి తీవ్రంగా నష్టపరుస్తోంది. ఈ సారి 7.50 లక్షల ఎకరాల్లో సాగైనట్లు అంచనా.. ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. భారీ వర్షాల తర్వాత వాతావరణం ఉక్కపోతగా మారడంతో సుడిదోమ ఉద్ధృతి పెరిగినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మామునూరు కృషి విజ్ఞానకేంద్రం కీటక శాస్త్రవేత్త డా. రాజు, వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి కె. అనురాధ రైతులకు సూచించారు. 'పొలాల్లో నీటిపై భాగంలో దోమలు తేలుతూ మొదళ్ల చుట్టూ తిరుగుతూ రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. మొక్క సుడులుగా ఎండిపోతుంది. పొట్ట దశలో ఉద్ధృతి ఎక్కువైతే గింజరాదు. నూకశాతం పెరిగి దిగుబడి పడిపోతుంది. పొలాల్లో తూర్పు, పడమర దిశగా రెండు మీటర్ల దూరంగా పాయలు ఏర్పాటు చేస్తే పంటకు గాలి, వెలుతురు సోకి దోమ ఉద్ధృతి తగ్గుతుంది. పొలంలో నీరు పెడుతూ తీసివేస్తే గుడ్లు, పిల్ల దోమల ఉద్ధృతి తగ్గుతుంది. దోమ కనిపించిన మొదటి దశలో వేపనూనె 1500 పీపీఎం 5 మి.లీ నీటికి కలిపి పిచికారీ చేయాలి. తర్వాత దశలో ట్రైఫ్లుమిజోఫైరిమ్ మందును 94 మి.లీ ఎకరానికి పిచికారీ చేయాలి. దోమ ఉద్ధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 1.5 గ్రా. ఎసిపేట్ 75 ఎస్.పి కలిపి వరి మొదళ్లపై పడేలా పిచికారీ చేయాలి. అప్పటికీ నివారణ కాకపోతే లీటరు నీటికి 0.4 గ్రా. డైనోటెఫ్యూరాన్ 20 ఎస్‌జి లేదా 0.60 గ్రా పైమెట్రోజిన్ 50 డబ్ల్యూజి లేదా ట్రైఫ్లూమోజోపైరిమ్ 0.485 మి.లీ కలిపి పిచికారీ చేయాలి. పొట్ట దశలో యూరియాతో పాటు పొటాష్ కలిపి వేసుకుంటే మొక్కకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని' వివరించారు.



దోమ ఉద్ధృతిని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త డా.రాజు

రైతేరాజు

ఉల్లిసాగుకు సమయమిదే...

మెళకువలు



డా.రాజు,శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు.

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే : ఉల్లికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వినియోగం పెరగడంతో ధరలు కూడా నిలకడగా ఉంటున్నాయి. సాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే.. లాభాలు గడించవచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.రాజు తెలిపారు. 'వర్షాకాలంలో నవంబర్‌లోగా విత్తుకునే అవకాశం ఉంది. ఉల్లి సాగుకు ఎకరాకు మూడు, నాలుగు కిలోల విత్తనాలు అవసరమవుతాయి. నేలను బాగా దున్ని 120 సెం.మీ వెడల్పు, 3 మీటర్ల పొడవైన నారుమళ్లను తయారు చేసుకోవాలి. రెండు కిలోల విత్తనం 200 చ.మీ.ల నారుమడికి సరిపోతుంది. విత్తనశుద్ధి చేయాలి. మూడు గ్రాముల కాప్టాన్ లేదా థైరామ్ కిలో విత్తనానికి కలిపి నారుమడిలో పలచగా వరుసల్లో పోయాలి. నారుకుళ్లు తెగులు సోకకుండా పది రోజులకోసారి కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు పురుగు ఆశించకుండా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు నారుమడిలో చల్లి నీరు కట్టాలి. నాటిన 75 రోజుల తర్వాత మాలిక్ హైడ్రజైడ్ 2.5 గ్రా. లీటరు నీటికి ద్రావణాన్ని చల్లడం వల్ల మొలక నష్టం బాగా తగ్గుతుంది. నారునాటిన వంద రోజులకు కార్బండిజమ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే కుళ్లడం చాలా వరకు తగ్గుతుంది. ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 80 కిలోల నత్రజని, 30 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి. వేరుశనగ పిండి లేదా ఆముదపు పిండి వేసి, మట్టిని ఎగదోయడం వల్ల ఎక్కువ దిగుబడి వస్తుంది. నత్రజనిని రెండు దఫాలుగా వేసుకుంటే గడ్డ బాగా ఊరుతుంది. నాటిన 60 రోజుల వరకు 15 రోజుల వ్యవధిలో నాలుగు, అయిదు తడులు ఇవ్వాలి. గడ్డ ఊరే దశలో ఏడు రోజుల వ్యవధిలో ఏడు, ఎనిమిది తడులివ్వాలి. కోతకు 15 రోజుల ముందుగా నీరు కట్టడం ఆపాలి. వానాకాలం ఎకరానికి 80 నుంచి 100 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. యాసంగిలో 130 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని' వివరించారు.



దేవన్నపేటలో సాగుచేసిన ఉల్లి

ప్రశ్న-సమాధానం

? మిరప పంటలో తామర పురుగుల నివారణ చర్యలు తెలపండి..? **-వి.బుచ్చిరెడ్డి. దేవన్నపేట**

✔ తామర పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చడంతో పైకి ముడుచుకుంటాయి. దీన్ని నివారించడానికి నాటిన 15, 45, రోజులకు ఎకరాకు 8 కిలోల ఫిప్రోనిల్ గుళికలు తగినంత తేమ ఉన్నప్పుడు వేయాలి. అవసరాన్ని బట్టి ఎసిఫేట్ 1.5 గ్రా. డైమిథియేట్ 2 మి.లీ. లేదా క్లోరోఫైరిఫాస్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

-తిరుపతి, ఉద్యానశాఖ అధికారి, వరంగల్




తామర పురుగులు ఆశించడంతో ముడుచుకుపోయిన మిరప మొక్కలు

–న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం

గులాబీ.. లాభాల గుబాళింపు





చక్రధర్‌రావు

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే : మెట్ట ప్రాంతంలో గులాబీ తోట సాగుచేసి కొంత మంది కూలీలకు ఉపాధి కల్పిస్తూ లాభాలు పొందుతున్నారు. మండంలోనే గులాబీ తోట సాగు చేసి ఆదర్శంగా నిలిచారు.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిర్లపల్లి గ్రామానికి చెందిన రైతు తూముల చక్రధర్‌రావు సుమారు పదేళ్ల కిందట హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం జీల్గుల గ్రామంలో రెండెకరాల భూమి కొనుగోలు చేశారు. అందులో వ్యవసాయం చేస్తున్నాడు. ఎకరంలో వరి, పత్తి సాగు చేశాడు. మిగతా ఎకరంలో సుమారు రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టి ఏడాది క్రితం గులాబీ తోట సాగు చేశారు. నెల నుంచి పువ్వులు దిగుబడి తీస్తున్నారు. వారంలో రెండు సార్లు కోసి విక్రయిస్తున్నారు. చెట్లకు మూడు రోజులకోసారి 40 నుంచి 50 కిలోల పూలు పూస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.80 నుంచి రూ.100 వరకు ధర ఉంది. తోట వద్దకు వచ్చేవారికి రూ.100కు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. రైతు చక్రధర్ మాట్లాడుతూ... నెల రోజులుగా పూలు పూస్తున్నాయి. పండగల వేళల్లో ధర ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయాధికారుల సూచన మేరకు సస్యరక్షణ చేపడుతున్నాం.. మొక్కలకు దిగుబడి అనంతరం కొమ్మల కత్తిరింపు చేపడుతూ.. పదేళ్ల వరకు పూల దిగుబడి పొందవచ్చని వివరించారు.



రోడ్డు ప్రమాదంలో మాజీ వైస్ ఎంపీపీ మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



బండం పుష్పలత(పాతచిత్రం)

మహదేవపూర్, న్యూస్‌టుడే : మహదేవపూర్ మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ బండం పుష్పలత(48) హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వివరాలు ఇలా.. బొమ్మాపూర్ గ్రామానికి చెందిన బండం లక్ష్మారెడ్డి, పుష్పలత దంపతులు.. లక్ష్మారెడ్డి రైతు సమన్వయసమితి అధ్యక్షులుగా దీర్ఘకాలం కొనసాగారు. గతేడాది భూపాలపల్లి-కాటారం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృత్యువాతపడ్డారు. విదేశాల్లో ఉద్యోగం చేస్తున్న కుమారుడు బండం మనోహర్‌రెడ్డి ఇటీవల తండ్రి సంవత్సరీక కార్యక్రమానికి వచ్చారు. తిరిగి అమెరికాకు వెళ్లడానికి సోమవారం తల్లి పుష్పలతతో కలిసి కారులో బయల్దేరారు. ఈ క్రమంలో హైదరాబాద్ ఔటర్‌రింగ్ రోడ్డులో వెళ్తుండగా వర్షంలో రహదారి కనిపించక కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఘటనలో పుష్పలత తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. కుటుంబ సభ్యులకు గాయాలవగా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఏడాది క్రితం భర్త, తాజాగా భార్య మృతిచెందడం తీవ్ర విషాదం నింపింది. ఆమె మొదటగా బొమ్మాపూర్ ఎంపీటీసీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. మరోమారు ఎంపీటీసీగా ఎన్నికై వైస్ ఎంపీపీగా కొనసాగారు. మండలానికి ఆమె చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకొని ప్రజలు కన్నీటిపర్యంతమయ్యారు. ఇటీవల బండం లక్ష్మారెడ్డి సంవత్సరీక కార్యక్రమం సందర్భంగా గ్రామంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. భార్యాభర్తలు ప్రజాప్రతినిధులుగా ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సేవలు అందించారని, వారి మృతి తీరని లోటని పలువురు రోదించారు. మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సహకార సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న ఛైర్మన్ ప్రశాంత్

కాటారం, న్యూస్‌టుడే : స్థానిక గారెపల్లి(కే) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఛైర్మన్ తోటపల్లి ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంస్థలు, పీఏసీఎస్ అభివృద్ధిపై చర్చించారు. కాటారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం లేక, సరైన మద్దతు ధర అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రుణమాఫీ అమలు కాని రైతులకు అందేలా చూడాలని పలువురు రైతులు సభ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మార్కెట్ యార్డు ఏర్పాటు, కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని తీర్మానించారు. ఛైర్మన్ ప్రశాంత్ మాట్లాడుతూ పీఏసీఎస్‌లో పారదర్శకంగా సేవలు అందిస్తున్నామని, రైతులకు ఎరువుల కొరత లేకుండా చూశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ దబ్బెట స్వామి, సీఈవో ఎడ్ల సతీష్ పాల్గొన్నారు.

మల్హర్ : తాడిచెర్ల ప్రాథమిక సహకార సంఘం ఛైర్మన్ ఇప్ప మొండయ్య అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. పలు సమస్యలపై డైరెక్టర్లు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణాలు, ఇతర సేవలు సులభతరంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. సంఘం లావాదేవీల నిల్వశాతం పెంపు, ప్రహరీ నిర్మాణానికి అనుమతి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మల్క సూర్యప్రకాష్‌రావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మహదేవపూర్ : రైతులకు మెరుగైన సదుపాయాల కల్పన, సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు శ్రీపతి బాపు పేర్కొన్నారు. ఆయన అధ్యక్షతన మహదేవపూర్ పీఏసీఎస్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘం సేవలు విస్తరించడానికి రైతులు, సంఘం సభ్యులు, ప్రజలు సహకారం అందించాలని కోరారు. సంఘం తరఫున ఫంక్షన్ హాల్ నిర్మాణం, లావుని పట్టా భూములకు రుణాలు ఇవ్వడం, సంఘం నగదు విలువ పెంచడంపై తీర్మానాలు చేశారు. సీఈవో రాజబాపు, సభ్యులు ఇబ్రహిం, చీర్ల తిరుపతితో పాటు పలువురు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097,
భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

కాలువలో మట్టి తొలగింపు



చిట్యాల : మండల కేంద్రంలోని కృష్ణకాలనీలో మురుగు కాలువలో నిండిపోయిన మట్టిని పంచాయతీ సిబ్బంది తొలగించారు. సోమవారం ఈనాడులో ప్రచురితమైన కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి రవికుమార్ సిబ్బందిని తీసుకెళ్లి మురుగు కాలువను శుభ్రం చేయించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'ఈనాడు'కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

వీధి దీపాల ఏర్పాటు



చిట్యాల : తిరుమలాపూర్ గ్రామంలో వీధి దీపాలు వెలగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామానికి చెందిన శివ అనే యువకుడు సమస్యను 'మేమున్నాం..' దృష్టికి తీసుకొచ్చారు. విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రాజేశ్‌కు వివరించగా స్పందించి సోమవారం జీపీ సిబ్బందిని పంపించి నూతన లైట్లను ఏర్పాటు చేయించారు.



మహాముత్తారం : కొర్లకుంట పంచాయతీలోని లంబాడీపల్లిలో విద్యుత్తు దీపాలు లేక చీకటి అలుముకుంటోందని స్థానికులు 'మేమున్నాం..'కు సమాచారం అందించారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి బాబు దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిచే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించారు.

తిమ్మనకుంట స్థల సర్వే అడ్డగింత



కాటారం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో మినీ స్టేడియంకు కేటాయించిన తిమ్మనకుంట శిఖం భూమి సర్వేను పలువురు మహిళలు అడ్డుకున్నారు. 5.26 ఎకరాల భూమి ఆక్రమణకు గురవుతోందని.. చర్యలు తీసుకొని మినీస్టేడియం నిర్మాణం జరపాలని ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తిమ్మనకుంట స్థలాన్ని పూర్తిస్థాయిలో సంయుక్త సర్వే చేయాలని రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. సోమవారం డీఈఈ సతీష్, ఏఈ రాజేష్, ఆర్ఐ వెంకన్న, సర్వేయర్ వినయ్ యంత్రాలతో హద్దులు నిర్ణయించేందుకు స్థల సర్వే చేపట్టారు. పలువురు మహిళలు పురుగు మందు డబ్బాలతో అడ్డుకున్నారు. సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ చేరుకొని అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పోలీసుల సాయంతో మంగళవారం పూర్తి స్థాయిలో సర్వేచేసి హద్దులు నిర్ణయించాలని ఆదేశించారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాయిలు

పలిమెల, న్యూస్‌టుడే : భాజపా మతోన్మాద ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సీపీఎం ప్రథమ మహా సభలు నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సూదుల శంకర్ జెండావిష్కరణ చేశారు. అనంతరం బందు సాయిలు మాట్లాడుతూ.. భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, ఆదివాసులు, కార్మికులు, పేదలపై దాడులు, దౌర్జన్యాలు చేస్తోందని, ప్రజల్లో హింసను ప్రేరేపిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంచడానికి అవినీతి, అక్రమాలు జరగకుండా నిరోధించడానికి సమాచార హక్కు చట్టం తీసుకొచ్చిన ఘనత సీపీఎం పార్టీదేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని, లేదంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పోలం రాజేందర్, పాగే పొట్టయ్య పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై బస్సు బోల్తా

20 మందికి గాయాలు



యశ్వంతాపూర్ వద్ద బోల్తా పడిన బస్సు

జనగామ రూరల్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కేంద్రం సమీపంలోని యశ్వంతాపూర్ పరిధి హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బస్సు ముందు టైరు పేలిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, 19 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జనగామ సీఐ దామోదర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు నుంచి వరంగల్‌కు బయల్దేరిన ఓ ప్రైవేటు ట్రావెల్ సంస్థకు చెందిన లగ్జరీ బస్సులో 20 మంది ప్రయాణికులున్నారు. జనగామ మండలం యశ్వంతాపూర్-నిడిగొండ గ్రామాల మధ్య బస్సు రాగానే ముందు టైరు పేలడంతో ప్రమాదం జరిగింది. అందులో ఉన్న జయశంకర్ భూపాలపల్లికి చెందిన పోషయ్యకు చేయి పూర్తిగా విరిగి నుజ్జు నుజ్జయింది. బస్సు రహదారికి అడ్డుగా పడటంతో దాదాపు రెండు కి.మీ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పెద్ద ప్రమాదమే అయినా ఎలాంటి ప్రాణ నష్టం చోటు చేసుకోకపోవడంతో ప్రయాణికులు, పోలీసులు, స్థానికులు అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మహదేవపూర్, న్యూస్‌టుడే : మండలంలోని పలు గ్రామాల్లో మంథని మాజీ ఎమ్మెల్యే, భారాస నియోజకవర్గ బాధ్యుడు పుట్ట మధూకర్ సోమవారం పర్యటించారు. బొమ్మాపూర్ మాజీ సర్పంచి ఒడేటి పద్మ-రవీందర్ తల్లి ఇటీవల మృతిచెందగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అంబట్‌పల్లిలో పలు కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో భారాస మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, జక్కు రాకేష్, శ్రీపతిబాపు, అన్కారీ ప్రకాష్, అలీంఖాన్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులు హేయం



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్‌గౌడ్

టేకుమట్ల, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇప్పించి చట్టబద్ధత కల్పించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్‌గౌడ్ అన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులకు నిరసనగా సోమవారం వైద్యసేవలు బందు చేసి నిరసన తెలిపారు. మండలాధ్యక్షుడు భాస్కర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కత్తి సంపత్ హాజరై మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రథమ చికిత్స అందిస్తున్న వారిపై నిందలతో పాటు దాడులు జరుగుతున్నాయన్నారు. రోగులకు ప్రాథమిక చికిత్స అందించి.. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచిస్తున్నా వారు వెళ్లకుండా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి అడెపు సంపత్, సంఘం జిల్లా నాయకులు గొల్లపల్లి సంతోష్, రవీందర్‌రావు, నరేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

ఏఈగా కాంతాల రాజశేఖర్‌రెడ్డి



మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : మండల నీటి పారుదల శాఖ ఏఈగా కాంతాల రాజశేఖర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగం సాధించారు. గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి స్వగ్రామం. ఇంతకుముందు ఆయన రైల్వేలో ట్రాక్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తూ ఉన్నత ఉద్యోగం కోసం అహర్నిశలు కష్టపడి చదివి ఏఈ ఉద్యోగం సాధించారు.

కేటీపీపీ ఇన్‌ఛార్జి సీఈగా కోటేశ్వర్‌రావు

చెల్పూర్(గణపురం), న్యూస్‌టుడే : కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ ఇన్‌ఛార్జి సీఈగా ఐవీఎల్ కోటేశ్వర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీఈగా పనిచేసిన సిద్దయ్య సోమవారం పదవీ విరమణ పొందగా ఆయన స్థానంలో 500 మెగావాట్ల మొదటి యూనిట్‌లో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న కోటేశ్వర్‌రావు సీఈగా బాధ్యతలు చేపట్టారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : అంబేడ్కర్ యువజన సంఘం ఏర్పాటు చేసి 48 ఏళ్లయిన సందర్భంగా మండల అధ్యక్షుడు మంగళపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు కుమార్, నాయకులు చందర్, రామస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బాలికకు జ్ఞాపిక అందజేస్తున్న ఎస్సై సుధాకర్

భూపాలపల్లి, న్యూస్‌టుడే : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవి అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సై సుధాకర్ సూచించారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి పురస్కరించుకుని, స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక ఎస్సై సుధాకర్ విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోత్కు ప్రవీణ్, మాజీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



భూపాలపల్లి రూరల్, న్యూస్‌టుడే : విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, ప్రొఫెసర్ డాక్టర్ సతీశ్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్‌లో గురువందనం, ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రమణారెడ్డి, భాజపా రిటైర్డ్ ఎంప్లాయిస్, పెన్షనర్ కో కన్వీనర్ సరోత్తమ్‌రెడ్డి, వెంకరామిరెడ్డి, గిరిధర్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

మహదేవపూర్, న్యూస్‌టుడే : మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అధికారులు సోమవారం సందర్శించారు. రాష్ట్ర స్థాయి మానిటరింగ్‌లో భాగంగా ఆరోగ్య కేంద్రంలో రికార్డుల నిర్వహణ, రోగులకు అందించే సేవల నిర్వహణ ఎలా ఉండాలో పరిశీలన చేశారు. ఏవిధమైన రికార్డులను నిర్వహించాలో సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రంలో నాణ్యత ప్రమాణాలు, ఎలాంటి పరికరాలు అందుబాటులో ఉండాలో సూచించారు. అధికారుల బృందంలో విజయలక్ష్మి, చిరంజీవి, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మౌనిక పాల్గొన్నారు.

హద్దులు చూపాలని వినతి

కాళేశ్వరం, న్యూస్‌టుడే : మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం జర్నలిస్టులకు రెవెన్యూ శాఖ పట్టాలివ్వగా హద్దులు చూపాలని జిల్లా పాలనాధికారిని కాళేశ్వరం జర్నలిస్టులు కోరారు. సోమవారం ప్రజావాణిలో పాలనాధికారి రాహుల్‌శర్మను కలిసిన జర్నలిస్టులు తమకు గతేడాది 119/1 సర్వే నంబర్‌లో ఇంటి స్థలాల కోసం పట్టాలిచ్చారని.. అటవీ శాఖ తమ అధీనంలో భూమి ఉందని అడ్డుతగులుతున్నారని కలెక్టర్‌కు తెలిపారు. రెవెన్యూ, అటవీ శాఖ సంయుక్తంగా సర్వేలు నిర్వహించి తమకు హద్దులు చూపించాలని జర్నలిస్టులు కోరారు.

అలరించిన బతుకమ్మ సంబరాలు



కాటారం, న్యూస్‌టుడే : స్థానిక గిరిజన గురుకుల బాలికల, కస్తూర్బా బాలికల పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి ఆడిపాడి సందడి చేశారు. సంప్రదాయ దుస్తులతో బతుకమ్మ కోలాటాలు నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగలక్ష్మీ, సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మాడా వ్యవస్థ ఏర్పాటు చేయాలి

మహదేవపూర్, న్యూస్‌టుడే : మహదేవపూర్‌లో గతంలో మాదిరిగానే మాడా వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రత్యేకాధికారిని నియమించాలని ఆదివాసీ సంఘాల నాయకులు ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాను కోరారు. ఈ ప్రాంతానికి చెందిన ఆదివాసీ సంఘాల నాయకులు సోమవారం ఆమెను కలిసి వినతిపత్రం అందించారు. మహదేవపూర్‌తో పలు మండలాల్లో గిరిజన సంక్షేమం, అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు గుర్సింగ బాపు, సమ్మయ్య, ఇంద్రసేన, రవితేజ, శంకర్ పలువురు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించి ఆదుకోండి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన అనుమాల బాపు

మల్హార్, న్యూస్‌టుడే : తాడిచెర్ల జెన్‌కో ఉపరితల గని బొగ్గు ఉత్పత్తికి బాంబు పేలుళ్లు చేపట్టడంతో తన ఇల్లు కూలిపోయిందని గ్రామానికి చెందిన అనుమాల బాపు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 16న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒక్కసారిగా నేలమట్టమైందని వివరించారు. ఇంట్లో సామగ్రి దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు. పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

విద్యా ప్రదాత భాస్కర్‌రావు



మల్హార్, న్యూస్‌టుడే : తాడిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్క భాస్కర్‌రావు పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఎంతో మంది జీవితాల్లో విద్యా వెలుగులు నింపారని పలువురు ఆయన సేవలను కొనియాడారు. భాస్కర్‌రావు దంపతులను ఘనంగా సన్మానించారు.

రుణమాఫీలో ప్రభుత్వం విఫలం

టేకుమట్ల, న్యూస్‌టుడే : రైతులకు పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ కార్యదర్శి మారపెల్లి మల్లేశ్ అన్నారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా స్థానికంగా తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మల్లేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటివరకు 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. దసరాలోగా పూర్తిస్థాయిలో రుణ మాఫీ చేసి రైతు కళ్లలో ఆనందం నింపాలని ఆయన కోరారు.

లావుని పట్టా భూములకు రుణాలివ్వాలి

మహాముత్తారం : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఛైర్మన్ సోమ శాంతకుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. పీఏసీఎస్ ప్రగతి నివేదికను రైతులకు వివరించి సమస్యలపై చర్చించారు. ఛైర్మన్ మాట్లాడుతూ లావుని పట్టా భూములకు పంట రుణాలు మంజూరు చేయాలని, రైతుబంధు వెంటనే అందేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజు, వైస్ ఛైర్మన్ అనిల్‌రెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ నిరసన

టేకుమట్ల, న్యూస్‌టుడే : తిరుమల తిరుపతి లడ్డూ వివాదంపై సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ మండలాధ్యక్షుడు కదం రాజేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ తితిదేలో అన్యాక్రాంతమైన ఆలయ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నేరెళ్ల రామకృష్ణగౌడ్, దాసరి స్వామి, శ్రీను పాల్గొన్నారు.

భాగిర్థిపేటలో ప్రత్యేక వైద్య శిబిరం

రేగొండ, న్యూస్‌టుడే : భాగిర్థిపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఆదివారం సాయంత్రం శునకాల దాడిలో 40 మంది గాయపడిన విషయం తెలిసిందే. పీహెచ్‌సీ వైద్యాధికారి హిమబిందు సమక్షంలో వైద్యులు, సిబ్బంది గాయపడిన వారికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరానికి రాని వారి గురించి ఆరా తీశారు. సుమారు 23 మందికి వైద్యం చేసి మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



చిట్యాల, న్యూస్‌టుడే : అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని సంఘం నాయకులు సోమవారం మండలకేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూల మాలలు వేశారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను యువత ముందుకు తీసుకెళ్లాలన్నారు. కులమతాలకు అతీతంగా రాజ్యాధికారం చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్, జిల్లా సాంస్కృతిక కార్యదర్శి జన్నె యుగంధర్, కట్కూరి శ్రీనివాస్, పుల్ల ప్రతాప్, కనకం తిరుపతి, గురుకుంట్ల కిరణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



చిట్యాల, న్యూస్‌టుడే : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన రామ్‌చరణ్ అండర్-14 షార్ట్‌పుట్, సాయిచరణ్ అండర్-18 షార్ట్‌పుట్ విభాగాల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఈ నెల 7, 8 తేదీల్లో హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ సూదం సాంబమూర్తిని సోమవారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం రఘుపతి, రాజమౌళి, సరళదేవి, నీలిమారెడ్డి, విజయలక్ష్మీ, సుజాత, రామ్‌నారాయణ, ఉస్మానాలి, శంకర్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



బాధితులు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారం కోసం వస్తున్న వారి ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దివస్ కార్యక్రమంలో 16 మంది బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. చరవాణి ద్వారా సంబంధిత అధికారులతో ఎస్పీ మాట్లాడి, పూర్తి వివరాలు తెలుసుకొని, సమస్య పరిష్కారం కోసం దృష్టి పెట్టాలని ఆదేశించారు. భూ సమస్యలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి.

భూపాలపల్లి : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యమని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. పోలీసు కార్యాలయంలో సోమవారం ఉద్యోగ విరమణ పొందిన ఆర్ఎస్సై ఇనుగాల పాపిరెడ్డి, ఏఆర్ఎస్సైలు ఎండి.జలాలోద్దీన్, పోరెడ్డి రాజిరెడ్డి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాయబారపు శ్రీనివాస్‌ను పూలమాలలు, శాలువలతో ఎస్పీ ఘనంగా సత్కరించారు.


గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక

మొగుళ్లపల్లి : మండలంలోని పెద్దకోమటిపల్లి గ్రామంలో గౌడ సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెరుగు భిక్షపతి గౌడ్, ఉపాధ్యక్షుడిగా గడ్డం రకోధర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం రమేష్ గౌడ్, కోశాధికారిగా మెరుగు తిరుపతిగౌడ్‌లను ఎన్నుకున్నారు.

పౌర హక్కులపై అవగాహన

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్ఐ సురేందర్ రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం జరిపి గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి



శ్రీరాం రవి(56)

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : చికిత్సపొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రంగాపురంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగాపురం గ్రామానికి చెందిన శ్రీరాం రవి(56) కొంతకాలంగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవపడుతుండేవాడు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. మృతుని కుమారుడు ప్రణిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

గంజాయి పట్టివేత

శాయంపేట, న్యూస్‌టుడే: శాయంపేట మండలం పత్తిపాక శివారులో సోమవారం గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. పత్తిపాక శివారులోని పెద్దగుట్ట వద్ద జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపెల్లికి చెందిన పల్లెబోయిన రాకేష్, వైనాల తిరుపతి, పరకాలకు చెందిన జన్ను సాయికృష్ణ, రౌతు అన్వేష్‌కుమార్, అల్లె రాజేష్, శాయంపేట మండలం సూర్యానాయక్‌తండాకు చెందిన జర్పుల సురేష్‌ల వద్ద 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.